క్లుప్తంగా

చర్చీల నిర్మాణానికి కృషి

మంత్రాలయం రూరల్: చర్చీల నిర్మాణానికి కృషి చేస్తామని వైఎస్సార్‌సీపీ నేత వై.ప్రదీప్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని 52 బసాపురం గ్రామంలో చర్చి నిర్మాణానికి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో పాస్టర్ సామేల్, పెద్దలు పాల్గొన్నారు. అలాగే నారాయణపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన శివాలయంలో శివలింగం, ఆంజనేయస్వామి దేవాలయంలో ఆంజనేయస్వామి వార్ల విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఆయా ఆలయాల్లో చేపట్టిన హోమ పూజల్లో పాల్గొన్నారు. ఫర్టిలైజర్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, నాయకులు లక్ష్మీనారాయణరెడ్డి, మద్దిలేటి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

9న ఓపెన్ ఫుట్‌బాల్ టోర్నీ

కోసిగి: రేణుక ఎల్లమ్మజాతరను పురస్కరించుకుని స్థానిక మౌంట్ కార్మెల్ పాఠశాల మైదానంలో ఈనెల 9వ తేదీన ఓపెన్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు వేణు, సతీష్ తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ పోటీలను ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి సహకారంతో వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ మురళీ మోహన్ రెడ్డి, ఆర్లబండ సహకార సంఘం అధ్యక్షుడు మఠం మహంతేష్ స్వామి పోటీలను ప్రారంభిస్తారని చెప్పారు. గెలుపొందిన వారికి వరుసగా రూ.12వేలు, రూ.8వేలు, రూ.4వేల నగదు అందజేస్తామన్నారు. ఆసక్తి కలిగిన క్రీడకారులు ఈనెల 8వ తేదీలోపు రూ.800 ఎంట్రీ ఫీజు చెల్లించి తమ జట్టు పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

రైల్వేస్టేషన్ తనిఖీ

మంత్రాలయం రూరల్: మండలంలోని తుంగభద్ర రైల్వే స్టేషన్‌ను మంత్రాలయం సీఐ శ్రీనివాసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైల్వే పోలీసులతో మాట్లాడి నేరస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని గంజాయి,కర్ణాటక మద్యం రవాణాపై నిఘా ఉంచాలని రైల్వే పోలీసులకు సూచించారు. ఎవరైనా అనుమానితులు కనిపిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని చెప్పారు. అనంతరం మాధవరం చెక్ పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేసి రికార్డులు సక్రమంగా లేని వాటికి జరిమానా విధించారు.

నేడు కేంద్ర బృందం రాక

నందవరం: నేషనల్ లెవల్ మానిటరింగ్ బృందం సోమవారం నందవరం మండలంలోని నాగలదిన్నె, మిట్టసోమాపురం గ్రామాలను సందర్శించనున్నట్లు ఎంపీడీఓ కృష్ణమూర్తి తెలిపారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ నిధుల వినియోగం, పథకాల పారదర్శకత గురించి తెలుసుకోవడానికి కేంద్ర బృందం వస్తున్నట్లు వివరించారు. ఆయా గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలతో సామావేశం ఉంటుందన్నారు. అలాగే మంగళవారం ముగతి గ్రామంలో గ్రామసభ ఉంటుందని చెప్పారు. మండలంలోని ఆయా శాఖ అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా హాజరు కావాలని ఎంపీడీఓ కోరారు.

నేడు బండలాగుడు పోటీలు

కృష్ణగిరి: మండల పరిధిలోని చిట్యాల గ్రామంలో లాలూస్వామి ఉరుసు సందర్భంగా సోమవారం రాష్ట్రస్థాయి పాలపళ్ల ఎద్దుల బండ లాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఆసక్తి కలిగిన వృషభాల యజమానులు ఉదయం 8 గంటల్లోపు రూ.500 ఎంట్రీఫీజు చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. విజేతలకు వరుసగా రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేల నగదు బహుమతులు అందించనున్నట్లు తెలిపారు. పేర్ల నమోదు, వివరాలకు 96520 25099, 77026 30416 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.

మట్టి పనుల పరిశీలన

మద్దికెర: మండల కేంద్రంలో ఈనెల 7న జరగబోయే మద్దమ్మ తిరునాల సందర్భంగా రోడ్డుపై మట్టి పనులు చేస్తున్నారు. ఆదివారం జెడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి, పంచాయతీ సలహాదారుడు ఆంజనేయులు పనులను పరిశీలించారు. వారు మాట్లాడుతూ భక్తుల సౌకర్యార్థం, రథోత్సవం సందర్భంగా ఆయా పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఎంపీటీసీ ఆంజనేయులు, నాయకులు శ్రీనివాసులు, కిట్టి ఉన్నారు.

కేంద్ర విద్యా విధానంలో లోపాలు

ఎమ్మిగనూరుటౌన్: కేంద్ర ప్రభుత్వ విద్యా విధానాల్లో ఎన్నో లోపాలున్నాయని వాటిలో మార్పులు అవసరమని డీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి గోట్ల చంద్రశేఖర్, జిల్లా అధ్యక్షుడు కరెకృష్ణ పేర్కొన్నారు. విద్యారంగ సమస్యల పరిరక్షణపై ఈనెల 7న కలెక్టరేట్ ఎదుట ఆంధ్రప్రదేశ్ విద్యా పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టనున్న ధర్నా కరపత్రాలను ఆదివారం స్థానిక డీటీఎఫ్ కార్యాలయంలో విద్యార్థి సంఘాల నాయకులతో కలిసి ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ నూతన జాతీయ విద్యా విధానం రద్దు, ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని కోరారు.

పీఎం వికాస్ పథకం ప్రారంభం హర్షణీయం

పత్తికొండ రూరల్: ప్రధానమంత్రి విశ్వకర్మ కౌశల్ సమ్మాన్ పథకం (పీఎం వికాస్) ప్రారంభించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఆదివారం పార్టీ నాయకులు, కార్యకర్తలు స్థానిక కార్యాలయం నుంచి ర్యాలీగా నాలుగు స్తంభాల కూడలికి చేరుకుని జాతిపిత మహాత్మాగాంధీ, అమరజీవి పొట్టిశ్రీరాములు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రంగాగౌడు, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రొంగల గోపిశ్రీనివాస్, ఐటీ సెల్ కన్వీనర్ రంజిత్ కర్ణి మాట్లాడుతూ చేతి వృత్తుల ప్రోత్సాహకానికి కేంద్ర ప్రభుత్వం సహకారం అందిస్తుందన్నారు. బీజేపీ, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మెట్ట భూముల్లో జల సవ్వడి

- వైఎస్సార్ జలకళతో ఉచితంగా బోర్లు
- పథకం అమలులో పత్తికొండ క్లస్టర్ రికార్డు
- రైతు కుటుంబాల్లో వెల్లివిరుస్తున్న ఆనందం


వైఎస్సార్ జలకళ ద్వారా వేసిన బోర్లలో ఉబికి వస్తున్న నీరు

పత్తికొండటౌన్: జిల్లాలో కరువు ప్రాంతమైన పత్తికొండ నియోజకవర్గంలో వైఎస్సార్ జలకళ పథకం ద్వారా మెట్టభూముల్లో జల సిరులు ఉప్పొంగుతూ రైతు కుటుంబాల్లో ఆనందం నింపుతున్నాయి. రైతులకు ఇచ్చిన హామీ మేరకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఉచితంగా బోర్లు వేసేందుకు వైఎస్సార్ జలకళ పథకాన్ని ప్రారంభించారు. కనిష్టంగా 2.5 ఎకరాల నుంచి గరిష్టంగా 5 ఎకరాల్లోపు భూమి కలిగిన రైతులకు ఉచితంగా బోర్లు వేసి మెట్ట భూములకు సాగునీరు అందిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 3 లక్షల మంది రైతులకు ఉచితంగా వ్యవసాయ బోర్లు వేసేందుకు ప్రభుత్వం రూ.2340 కోట్లు కేటాయించింది. జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) ప్రాజెక్టు క్రింద వైఎస్సార్ జలకళ పథకాన్ని అమలు చేస్తున్నారు. డ్వామా ప్రాజెక్టుకు కర్నూలు జిల్లాలో నాలుగు క్లస్టర్లు ఉన్నాయి. పత్తికొండ క్లస్టర్ వైఎస్సార్ జలకళ బోర్లు వేయడంలో రికార్డు సాధించింది. జిల్లాలో ప్రాజెక్టు డైరెక్టర్, క్లస్టరు పరిధిలో అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్లు, మండలస్థాయిలో ఏపీఓలు, టెక్నికల్ అసిస్టెంట్లు ఈ పథకం అమలును పర్యవేక్షిస్తున్నారు. పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ప్రత్యేక చొరవతో ఈ నియోజకవర్గ పరిధిలోని మండలాల్లో ఎక్కువ మంది రైతులకు ఉచితంగా బోర్లు వేశారు.

అర్హులైన రైతులకు బోర్లు



పత్తికొండ క్లస్టర్ పరిధిలో అర్హులైన రైతులకు వైఎస్సార్ జలకళ పథకం కింద ఉచితంగా బోర్లు వేయించాం. ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ప్రత్యేక చొరవ తీసుకుని సహకారం అందించడంతో జిల్లాలోనే విజయవంతంగా లక్ష్యాన్ని పూర్తి చేశాం. పత్తికొండ క్లస్టర్ జిల్లాలోనే గాకుండా రాష్ట్రస్థాయిలోనూ మెరుగైన ఫలితాలను సాధించింది. రైతుల కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి సాధించేందుకు ప్రభుత్వం తోడ్పాటు అందిస్తోంది.
– పద్మావతి, ఏపీడీ, డ్వామా



పత్తికొండ క్లస్టర్ పరిధిలో మండలాల వారీగా వేసిన బోర్ల వివరాలు

మండలం	వేసిన బోర్లు	నిధులు రూ.లక్షలలో	నీళ్లు పడిన బోర్లు
పత్తికొండ	121	108.56	110
తుగ్గలి	451	478.24	428
మద్దికెర	87	90.27	81
దేవనకొండ	65	78.22	64
ఆస్పరి	54	48.61	43
కోడుమూరు	18	20.11	15
మొత్తం	796	824.02 లక్షలు	741

పేద రైతులకు వరం

మాలాంటి చిన్న, సన్నకారు రైతులకు వైఎస్సార్ జలకళ పథకం ఒక వరం. మా పొలంలో ఉచితంగా బోరు వేశారు. నీళ్లు పడ్డాయి. ఇక నుంచి పంటల సాగులో ఎలాంటి ఇబ్బందులు ఉండవు. సీఎం జగనన్నకు రుణపడి ఉంటాం.
– లక్ష్మి, రైతు, రాంపల్లి గ్రామం

నీళ్లు పుష్కలంగా పడ్డాయి

మాకు 2.54 ఎకరాల భూమి ఉంది. ఇందులో వైఎస్సార్ జలకళ కింద ఉచితంగా బోరు వేశారు. 280 అడుగుల లోతు డ్రిల్లింగ్ చేశారు. నీళ్లు పుష్కలంగా పడ్డాయి. ఎలాంటి ఖర్చు లేకుండా మాలాంటి పేద రైతులకు సీఎం జగనన్న ఉచితంగా బోర్లు వేయించడం ఆనందంగా ఉంది. మా కుటుంబం జీవనాధారానికి ఎంతగానో తోడ్పడుతుంది.
– నరసింహప్ప, రైతు, దేవనబండ

జిల్లాలో క్లస్టర్ల వారీగా వేసిన బోర్ల వివరాలు

క్లస్టరు	వేసిన బోర్లు	నిధులు రూ.కోట్లలో	నీళ్లు పడిన బోర్లు
పత్తికొండ	796	8.24	741
ఆలూరు	332	2.99	299
ఎమ్మిగనూరు	232	2.16	194
కర్నూలు	57	0.47	44
మొత్తం	1,417	13.87కోట్లు	1278

ముగిసిన శ్రీ సిద్ధరూఢ స్వామి ఆలయ వార్షికోత్సవం


కలశాలతో ఊరేగింపుగా వస్తున్న భక్తులు


కోలాటాలు వేస్తున్న చిన్నారులు

కోసిగి: స్థానిక రైల్వే గేటు సమీపంలో కొలువైన శ్రీ సిద్ధరూఢ స్వామి ఆలయ సప్తమ వార్షికోత్సవ వేడుకలు వైభవంగా ముగిశాయి. ఆదివారం మాఘ మాస పౌర్ణమిని పురస్కరించుకుని వేకువజాము నుంచి స్వామి వారికి రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, పుణ్యావాచనం, బిల్వార్చన, మహామంగళ హారుతులు పట్టి విశేష పూజలు చేపట్టారు. సాయంకాలం స్వామి వారి ఆలయం నుంచి మూల విరాట్‌ను పల్లకీలో కొలువుంచి పురవీధుల గుండా శ్రీ రేణుక ఎల్లమ్మ దేవి ఆలయం, అక్కడి నుంచి ఊరు వాకిలి మీదుగా ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు కోలాటాలతో జానపద పాటలు, ఓం నమశ్శివాయా అంటూ శివనామ స్మరణంతో కదం తొక్కారు. తిరిగి ఆలయం చేరుకున్నారు. అనంతరం స్వామి వారి మూల విరాట్‌ను చిన్నపాటి రథంపై అధిష్టింపజేసి రైల్వే గేటు వరకు ఊరేగించి యథాస్థానానికి చేర్చారు. అంతకుముందు ఉదయం వివిధ ఆశ్రమల పీఠాధిపతుల మహాత్ములు ప్రవచనాలను వినిపించారు. మూడు రోజులుగా ఆలయం ప్రాంగణంలో పూజలు, మహాత్ముల ఉపన్యాసాలు నేటితో ముగిశాయి.

రమణీయం రేణుకాయల్లమ్మ రథోత్సవం


అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని రూరల్: మండలంలోని బలదూర్ గ్రామంలో వెలిసిన రేణుకాయల్లమ్మ జాతర మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అమ్మవారికి జలాభిషేకం, కుంకుమార్చన, పంచామృతాభిషేకం, మహామంగళహారతి తదితర ప్రత్యేక పూజలు చేపట్టారు. ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి అమ్మవారికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం 7 గంటలకు భక్తుల నడుమ ఉచ్చాయాన్ని లాగారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.


రథాన్ని లాగుతున్న దృశ్యం

సొంతింటి కల సాకారం


నూతన గృహాన్ని ప్రారంభిస్తున్న వై.ప్రదీప్‌రెడ్డి

మంత్రాలయం రూరల్: పేదవాడి సొంతింటి కలను సాకారం చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్‌సీపీ యువనేత వై.ప్రదీప్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని సూగూరు రహదారిలోనున్న జగనన్న కాలనీల్లో కటికె నసీమ, రాజాసాబ్ దంపతులకు రాష్ట్ర ప్రభుత్వం పేదలందరికీ ఇళ్ల కార్యక్రమంలో భాగంగా స్థలంతో పాటు ఇల్లు మంజూరు చేసింది. లబ్ధిదారులు నిర్మాణం పూర్తి చేసుకోవడంతో ఆదివారం వై.ప్రదీప్‌రెడ్డి ఇంటిని ప్రారంభించి దంపతులతో నూతన గృహ ప్రవేశం చేయించారు. ఆయన మాట్లాడుతూ అభివృద్ధి,సంక్షేమ పథకాల అమలు తీరును చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు ప్రభుత్వంపై అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. పక్కనే నిర్మాణంలో ఉన్న ఇళ్ల పునాదులను పరిశీలించి పనులు వేగవంతం చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. మండల నాయకులు బూదూరు లక్ష్మినారాయణరెడ్డి, మద్దిలేటి, పట్టణ ప్రధాన కార్యదర్శి అశోక్‌రెడ్డి, సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య, వ్యవసాయ సలహా మండలి సభ్యుడు మల్లికార్జున ఉన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

ఆలూరు రూరల్: క్రీడలతో మానసికోల్లాసం లభించి, ఒత్తిడి తగ్గుతుందని ఆలూరు సీఐ ఈశ్వరయ్య అన్నారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ పాఠశాల-2 మైదానంలో జర్నలిస్టులు, పోలీసులు ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ ఆడారు. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన పోలీసు జట్టు నిర్ణీత 12 ఓవర్లలో 126 పరుగులు చేసింది. ఎస్‌ఐలు రామానుజులు, మల్లికార్జున బ్యాటింగ్‌లో ప్రతిభ కనబర్చారు. ఛేదనకు దిగిన జర్నలిస్టుల జట్టు 12 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 94 పరుగులు మాత్రమే చేయగలిగింది. గోపాల్,రాజు, నాగరాజు రాణించారు. అనంతరం ఏపీయూడబ్ల్యూజే జిల్లా నాయకులు స్వరూప్ కుమార్, సుంకన్న విన్నర్, రన్నర్ జట్లకు షీల్డులు అందజేశారు.

ప్రారంభానికి సిద్ధంగా..


బాపురంలో ప్రారంభానికి ముస్తాబయిన గ్రామ సచివాలయ భవనం

కౌతాళం: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చింది. సిబ్బందితో పాటు పక్కా భవనాల నిర్మాణాలను చేపట్టింది ఇప్పటికే కౌతాళం-3సచివాలయం భవనం పూర్తవడంతో సేవలు అందుబాటులోకి వచ్చాయి. మండలంలోని బాపురం గ్రామ సచివాలయ భవన నిర్మాణం పూర్తవడంతో ప్రారంభానికి ముస్తాబు చేశారు. సుమారు రూ.35లక్షలతో నిర్మాణం చేపట్టినట్లు గ్రామ నాయకుడు గురునాథ్‌రెడ్డి తెలిపారు. త్వరలో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి చేతుల మీదుగా ప్రారంభింజేయిస్తామని చెప్పారు.

సైన్స్ ప్రదర్శనలో రాష్ట్ర స్థాయికి ఎంపిక


రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులకు ప్రశంసపత్రాలు అందజేస్తున్న డీఈఓ రంగారెడ్డి

కోసిగి: స్థానిక ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు సైన్స్ ప్రదర్శనలో రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని పాఠశాల ప్రిన్సిపాల్ సమీరా రెడ్డి తెలిపారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ శనివారం జిల్లా స్థాయిలో జరిగిన ప్రదర్శనలో 9వ తరగతి విద్యార్థి ఉదయ్ హర్షిత్, 10వ తరగతి విద్యార్థి రఘు పర్యావరణ అంశంలో భాగంగా మొక్కజొన్న పిండి, గ్లిజరిన్‌ను ఉపయోగించి బయో ప్లాస్టిక్ ప్రాజెక్టును తయారు చేసి ప్రదర్శించారన్నారు. భవిషత్ తరాలకు పర్యావరణ రహిత ప్లాస్టిక్ రూపొందిద్దామని నిరూపించారన్నారు. ప్రదర్శనలో ఉత్తమ ప్రతిభ కనపరిచి మొదటి స్థానం కైవసం చేసుకుందని చెప్పారు. ప్రాజెక్టును చూసి జిల్లా కలెక్టర్ కోటేశ్వర రావు, జిల్లా విద్యాధికారి రంగారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. సైన్స్ ఉపాధ్యాయిని ఉషారాణి, విద్యార్థులను ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

ఘనంగా జ్యోతి మహోత్సవ వేడుకలు


జ్యోతి ఉత్సవాల్లో తొగటవీర క్షత్రియులు


ఆటల పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న వై.సీతారామిరెడ్డి

పెద్దకడబూరు : మండలకేంద్రంలో వెలసిన శ్రీ చౌడేశ్వరిదేవి 26వ జ్యోతి మహోత్సవాన్ని తొగటవీర క్షత్రియులు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారుజామున స్థానిక మల్లికార్జున స్వామి ఆలయం నుంచి ప్రత్యేకంగ తయారుచేసిన 5 జ్యోతులను పురవీధుల్లో భజనలు, నృత్యాలతో, మంగళ వాయిద్యాల నడుమ, చిన్నారులు, ఆడపడుచుల కళశాలతో అమ్మవారి ఆలయానికి ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించారు. ఉత్సవాల్లో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకులు వై.సీతారామిరెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు.ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు తొగటవీర క్షత్రియులకు ఇచ్చిన హామీల్లో భాగంగా కల్యాణ మండపం నిర్మాణానికి ఎంపీ నిధులు మంజూరు చేయించామని చెప్పారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధానకార్యదర్శి పురుషోత్తంరెడ్డి, మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

కొత్తిమీర రైతుకు కష్టకాలం


కొత్తిమీర పంటను గొర్రెలకు మేతగా వదిలేసిన దృశ్యం

గోనెగండ్ల: రోజురోజుకు కొత్తిమీర ధర పడిపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కొనేందుకు వ్యాపారస్తులు సైతం ముందుకు రావడం లేదు. చేసేది లేక కొత్తిమీర సాగుచేసిన రైతులు మనోవేదన చెందుతున్నారు. గోనెగండ్లకు చెందిన లక్ష్మన్న ఎకరా పొలంలో రూ.80 వేలు ఖర్చు పెట్టి కొత్తిమీర సాగుచేశాడు. గిట్టుబాటు ధర లేకపోవడంతో కొత్తిమీర పంటను గొర్రెలకు మేతగా వదిలేశాడు. అదేవిధంగా మండలంలో దాదాపు 200 ఎకరాల్లో రైతులు కొత్తి మీర సాగుచేశారు. ప్రభుత్వం స్పందించి కొత్తిమీరకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతున్నారు.

కనులపండువగా రథోత్సవం


ఆలూరులో బసవేశ్వర స్వామి రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ఆలూరు: దేవనకొండ మండలం కప్పట్రాళ్ల గ్రామ ఫారెస్టులో కొలువుదీరిన కొలుట్ల చెన్నకేశవ స్వామి రథోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ హనుమంత రెడ్డి, ఈఓ బి.చంద్రశేఖర్‌రెడ్డి సమక్షంలో ఉదయం స్వామివారికి కుంకుమార్చన, ఫల, పుష్ప, శాంతి హోమం, పంచామృతాభిషేకం, మహామంగళహారతి తదితర పూజలు జరిపించారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవ స్వామిని రథంపై కొలువుంచి భక్తుల జయజయధ్వానాల మధ్య ఆలయం నుంచి ఎదురు మండపం వరకు లాగారు. రథోత్సవంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గుమ్మనూరు నారాయణ స్వామి, శ్రీనివాసులు, ఎంపీపీ లక్ష్మిదేవి, జెడ్పీటీసీ సభ్యుడు రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

బసవేశ్వర స్వామి రథోత్సవం

ఆలూరు రూరల్: హాలహర్వి మండలంలోని బాపురం గ్రామంలో కొలువైన బసవేశ్వర స్వామి రథోత్సవం ఆదివారం సాయంత్రం కమనీయంగా సాగింది. ముందుగా స్వామి ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం 6 గంటలకు వేలాది భక్తుల నడుమ రథోత్సవం కమనీయంగా సాగింది. ఆలయ కమిటీ నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు.

కోతల బడ్జెట్‌తో కార్మికులు, కర్షకులకు చేటు

ఆదోని రూరల్ : ఈనెల 1న కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన కోతల బడ్జెట్‌తో కార్మికులు, కర్షకులకు చేటు కలిగిస్తుందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు కె.వెంకటేశులు విమర్శించారు. ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో బి.వీరారెడ్డి అధ్యక్షతన జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగంలో ఎరువుల సబ్సిడీ రూ.50 వేల కోట్లు కోత పెట్టిందని, అలాగే ఆహార సబ్సిడీని రూ.లక్ష కోట్లకు కుదించిందని, ఉపాధి హామీ పథకానికి రూ.30 వేల కోట్లు కోత పెట్టిందని వివరించారు. మరోపక్క విభజన చట్టంలో పేర్కొన్న విధంగా రాష్ట్రానికి నిధులు, ప్రత్యేకహోదా, కేంద్రీయ విశ్వవిద్యాలయాలు, రాజధాని అభివృద్ధికి, మెట్రో రైల్వేకి నిధులు కేటాయించలేదని మండిపడ్డారు. మండల నాయకులు కె.లింగన్న, డి.రామాంజనేయులు, ఎం.ఉచ్చీరప్ప, సభ్యులు బాషా, అయ్యప్ప, తిక్కప్ప, చిన్నతిక్కన్న పాల్గొన్నారు.

మార్చిలో విద్యుత్ సర్కిల్ డే

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ కర్నూలు సర్కిల్ డే వేడుకలను మార్చిలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం. ఉమాపతి పేర్కొన్నారు. అధికారులు, ఉద్యోగులు, కార్మికుల్లో మానసిక ఉల్లాసాన్ని నింపేందుకు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. కర్నూలు సర్కిల్ కార్యాలయం, కర్నూలు, ఆదోని, నంద్యాల డివిజన్ల టీమ్‌ల వారీగా క్రీడలు నిర్వహించనున్నట్లు తెలిపారు. దీనిపై ఇప్పటికే సమావేశం నిర్వహించినట్లు వెల్లడించారు.

శివ పంచాక్షరి మంత్ర జపం



మంత్రాలయం రూరల్: మండలంలోని వగరూరు గ్రామ రామలింగేశ్వరస్వామి ఆలయంలో శివ మాల ధరించిన గురుస్వాములు జంగం బద్రి స్వామి, రామస్వామి ఉదయం 5:45 నిమిషాలకు శివ పంచాక్షరి మంత్ర జపం ప్రారంభించి మధ్యాహ్నం 2 గంటల వరకు ఏకధాటిగా 55,188 సార్లు జపించారు.